క్లుప్తంగా

పేర్నమిట్ట కార్పొరేట్ డివిజన్ల పరిధిలో పింఛన్ల పంపిణీ

చీమకుర్తి: పేర్నమిట్ట 40వ డివిజన్‌లో స్థానిక కార్పొరేటర్ తేళ్ల చంద్రశేఖర్ చేతుల మీదుగా నూతనంగా మంజూరైన 25 పింఛన్లను శుక్రవారం అందించారు. 42వ డివిజన్‌లోని స్థానిక కార్పొరేటర్ నూకతోటి మస్తానమ్మ, ఈశ్వరరావు చేతుల మీదుగా నూతనంగా మంజూరైన 26 పింఛన్లను లబ్ధిదారులకు అందించారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

పంటల ఈ-క్రాప్ వివరాలు నమోదు చేసుకోవాలి



రాపర్ల గ్రామంలో ఈ-క్రాప్ నమోదు వివరాలు పరిశీలిస్తున్న ఏవో వెంకట్రావు

నాగులుప్పలపాడు: ఖరీఫ్‌లో పంటలు సాగు చేసిన రైతులు తప్పకుండా తమ పంట వివరాలను నమోదు చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి వెంకట్రావు తెలిపారు. మండలంలోని రాపర్ల గ్రామంలో జరుగుతున్న ఈ-క్రాప్ నమోదు వివరాలను శుక్రవారం పరిశీలించిన ఆయన మాట్లాడుతూ పంట నష్టపరిహారాలు పొందాలన్నా, ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో పంటలు అమ్ముకోవాలంటే తప్పకుండా ప్రతి రైతు సాగు చేసిన తమ పంట వివరాలను రైతు భరోసా కేంద్రాల్లోని వ్యవసాయ శాఖ సిబ్బంది ద్వారా నమోదు చేసుకోవాలని తెలిపారు.

రాజ్యలక్ష్మి అమ్మవారిని గాజులతో అలంకరణ



గాజులతో అలంకరణలో రాజ్యలక్ష్మి అమ్మవారు

ఒంగోలు మెట్రో: శ్రావణ శుక్రవారం సందర్భంగా కొప్పోలులోని చెన్నకేశవస్వామి ఆలయంలో శ్రీ రాజ్యలక్ష్మి అమ్మవారి మూలవిరాట్‌కు ఆలయ అర్చక స్వామి సుగంధ పరిమళ ద్రవ్యాలతో అభిషేకం నిర్వహించి 250 డజన్ల గాజులతో ప్రత్యేక అలంకరణ చేసి మంగళ హారతులతో భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. అనంతరం అర్చక స్వామి పరాంకుశ సమీర్ కుమార్ ఆధ్వర్యంలో శాస్త్రోక్తంగా స్థానిక మహిళ భక్తుల చేత సామూహిక కుంకుమార్చన నిర్వహించారు. శ్రావణమాసం చివరి శుక్రవారం కావడంతో మహిళా భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారి దర్శనం చేసుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించి ఆలయ అర్చక స్వామితో వేద ఆశీర్వచనం తీసుకున్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

ఒంగోలు సబర్బన్: నగరంలోని నిర్మల్ నగర్ పరిసర ప్రాంతాల్లో శనివారం విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నట్లు విద్యుత్ శాఖ ఒంగోలు పట్టణ డీఈఈ వినయ్‌కుమార్ రెడ్డి తెలిపారు. ఈ మేరకు ఆయన విడుదల చేసిన ప్రకటనలో ఒంగోలు నగరంలోని డీ-1 విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలోని విద్యుత్ లైన్ల కింద చెట్ల కొమ్మలు కొట్టే పనులు చేపడుతున్నామన్నారు. అందులో భాగంగా నిర్మల్ నగర్ పార్కు, బృందావన్ నగర్, పండరీ పురం, పంచముఖ ఆంజనేయ స్వామి టెంపుల్, భవానీ వీధి, బీఎస్ఎన్ఎల్ ఆఫీసు, అంజయ్య రోడ్డు ఏరియాల్లో ఉదయం 7 గంటల నుంచి 10 గంటల వరకు సరఫరా ఉండదన్నారు.

మోక్షగుండం సేవలు మరువలేనివి

- ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి



ఎమ్మెల్యే బాలినేనికి వినతిపత్రం అందిస్తున్న ఇంజినీర్లు

ఒంగోలు సబర్బన్: భారతరత్న మోక్షగుండం విశ్వేశ్వరయ్య దేశానికి చేసిన సేవలు మరువలేనివని మాజీ మంత్రి, ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. విశ్వేశ్వరయ్య జయంతిని పురస్కరించుకొని ఇంజినీర్స్ డే వేడుకలు స్థానిక ప్రకృతి రెస్టారెంట్‌లో అల్ట్రా టెక్ సిమెంట్ సౌజన్యంతో శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బాలినేని శ్రీనివాసరెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా బాలినేని మాట్లాడుతూ నిర్వాహకులు అడిగిన మేరకు ఒంగోలు నగర పాలక సంస్థ కార్యాలయం ప్రాంగణంలోని పార్కులో మోక్షగుండం విశ్వేశ్వరయ్య విగ్రహానికి స్థలం కేటాయిస్తున్నట్లు బాలినేని వారికి హామీ ఇచ్చారు. అదేవిధంగా ఇంజినీర్స్ అసోసియేషన్ భవనం కోసం స్థలం అడిగారని, కలెక్టర్ ఏఎస్ దినేష్ కుమార్‌తో మాట్లాడి స్థలం కేటాయించేందుకు పూనుకుంటానని బాలినేని చెప్పారు. ఈ సందర్భంగా బాలినేనికి వినతి పత్రాన్ని అందించారు. ఒంగోలు నగర కమిషనర్ ఎం.వెంకటేశ్వరరావు ఇంజినీర్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ ఎస్ఎస్ రాజు, కార్యదర్శి మధు బాబుతో పాటు పలువురు పాల్గొన్నారు.

ఆరోగ్య ఆంధ్రప్రదేశ్ లక్ష్యంగా వైద్యసేవలు



ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్‌బాబు

నాగులుప్పలపాడు: ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని ఆరోగ్యంగా ఉంచాలనే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పనిచేస్తున్నారని సంతనూతలపాడు ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్ బాబు అన్నారు. జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని శుక్రవారం ఉప్పుగుండూరులో ప్రారంభించిన ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామాల్లో ఇంటింటికీ వైద్యులను పంపి వారికి ఆరోగ్య సేవలు అందించడమే ముఖ్యమంత్రి లక్ష్యంగా పెట్టుకున్నారని అన్నారు. ఈ కార్యక్రమం ద్వారా గ్రామాల్లోని ప్రజలకు చాలా ఉపయోగకరంగా ఉంటుందని, ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం ఇటీవల వెంకటేశ్వర వెటర్నరీ యూనివర్సిటీ అడ్వైజర్ కమిటీ మెంబర్‌గా ఎన్నికైన ఎమ్మెల్యే సుధాకర బాబును నాయకులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ మారెళ్ల బంగారు బాబు, పార్టీ మండల కన్వీనర్ పోలవరపు శ్రీమన్నారాయణ, స్టేట్ డైరెక్టర్లు పేరాల చెన్నకేశవులు, కొలకలూరి విజయ్‌కుమార్, కూనం పూర్ణచంద్ర రావు, ఇనగంటి వెంకట రమణా రెడ్డి, ప్రసన్న, సర్పంచ్ దేవరకొండ జయమ్మ, ఎంపీటీసీ మున్నంగి వెంకట్రావు, కొమ్మూరి సుధాకర్, తహసీల్దార్ సుజన్ కుమార్, ఎంపీడీవో జయమణి తదితరులు పాల్గొన్నారు.

రూ.35 కోట్లతో సంతనూతలపాడులో

అభివృద్ధి-సంక్షేమం

- ప్రజల సంపూర్ణ ఆరోగ్యమే జగనన్న సురక్ష కార్యక్రమం
- ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్‌బాబు



సంతనూతలపాడులో నూతన పింఛన్లను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్‌బాబు

చీమకుర్తి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారం చేపట్టినప్పటి నుంచి ఇప్పటి వరకు ఒక్క సంతనూతలపాడు మేజర్ పంచాయతీలోనే రూ.35 కోట్ల విలువ చేసే అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు అందించినట్లు ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్ బాబు తెలిపారు. శుక్రవారం సంతనూతలపాడులో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంపై అవగాహన కల్పించే కార్యక్రమంలో ఎమ్మెల్యే టీజేఆర్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సంతనూతలపాడులోని 1,2 సచివాలయాల పరిధిలోని లబ్ధిదారులకు రూ.25.5 కోట్ల విలువ చేసే సంక్షేమ కార్యక్రమాలను అందించారని గుర్తు చేశారు. అభివృద్ధి పనులకు మరో రూ.10 కోట్లు వరకు అందించినట్లు తెలిపారు. ఇంత పెద్ద మొత్తంలో సంతనూతలపాడుకు నిధులు అందించిన చరిత్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికే దక్కుతుందన్నారు. నూతనంగా తీసుకొచ్చిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం చాలా అద్భుతమైందన్నారు. ప్రజలందరికీ చక్కటి ఆరోగ్యం అందించేందుకు ఫ్యామిలీ కాన్సెప్ట్‌తో పాటు ప్రత్యేక వైద్యశిబిరాలు ఏర్పాటు చేసి మరీ వైద్యం, ఉచితంగా మందులు అందించేందుకే జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని అమలు చేస్తున్నారన్నారు. దానిలో భాగంగా వైద్యసిబ్బంది ఇంటింటికీ వెళ్లి ప్రజలకు ఉన్న ఆరోగ్య సమస్యలను గుర్తించి వారందరికీ ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వైద్యశిబిరంలో వైద్యంతో పాటు మందులు అందిస్తారని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం సంతనూతలపాడులోని రెండు సచివాలయాల పరిధిలో నూతనంగా మంజూరైన పింఛన్ల నగదును లబ్ధిదారులకు అందించారు. కార్యక్రమంలో ఎంపీపీ బీ.విజయ, జెడ్పీటీసీ దుంపా రమణమ్మ, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ దుంపా చెంచిరెడ్డి, సొసైటీ ప్రెసిడెంట్ దుంపా యలమందారెడ్డి, స్థానిక అధికారులు, సచివాలయ సిబ్బంది, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రీ సర్వేతో భూములకు భద్రత



పోతవరం గ్రామ సభలో మాట్లాడుతున్న ఎంపీపీ

నాగులుప్పలపాడు: బ్రిటీష్ కాలం నాటి రికార్డుల అనంతరం నేటికీ భూమి వివరాలు తారుమారుగా ఉండటంతో ప్రతి రైతుకు తన భూమిపై పూర్తి భద్రత, హక్కు కల్పించడానికి ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి ప్రవేశపెట్టిన మంచి పథకమే ఈ జగనన్న భూ రక్ష పథకం అని ఎంపీపీ నలమలపు అంజమ్మ కృష్ణారెడ్డి అన్నారు. జగనన్న భూ రక్ష కార్యక్రమంలో భాగంగా పోతవరం గ్రామంలో నిర్వహించనున్న రీ సర్వే పై శుక్రవారం రైతులకు అవగాహన సదస్సును గ్రామ సచివాలయంలో ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్ సుజన్ కుమార్ మాట్లాడుతూ రికార్డులను పూర్తి స్థాయిలో ప్రక్షాళన చేయడంతో పాటు రైతుల వివరాలు అన్ని సవివరంగా రూపొందించడానికి ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి చేపట్టిన ఈ కార్యక్రమం వలన ప్రతి రైతుకు లబ్ధి చేకూరుతుందని, దీనికి ప్రతి ఒక్కరూ సహకారం అందించి తమ భూమి వివరాలను భద్రపరుచుకోవాలని కోరారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ శీలం రేణుక సురేష్, మండల సర్వేయర్ నందయ్య, రీ సర్వే డిప్యూటీ తహసీల్దార్ శ్రీనివాస్, వీఆర్వో మాధవి, సచివాలయ సిబ్బంది ఉన్నారు.

ప్రతిభను వెలికితీసేందుకే యువజనోత్సవం



వివేకానందుని చిత్రపటానికి పూలమాల వేస్తున్న ప్రిన్సిపాల్ హనుమంతరావు



యువజనోత్సవంలో సత్తాచాటిన చిన్నారులు

ఒంగోలు: యువతలో దాగి ఉన్న ప్రతిభను వెలికితీసేందుకు యువజనోత్సవం దోహదపడుతుందని క్విస్ విద్యాసంస్థల వైస్ చైర్మన్ గాయత్రీదేవి పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక క్విస్ ఇంజినీరింగ్ కాలేజీలో జిల్లా యువజన సంక్షేమశాఖ, స్టెప్ సంయుక్తంగా నిర్వహించిన యువజనోత్సవంలో గాయత్రీదేవి మాట్లాడుతూ ఇటువంటి కార్యక్రమాలు మిక్కిలిగా జరుగుతుండాలని, తద్వారా యువతలో మంచి ఉత్సాహం, ఉల్లాసం కనిపిస్తాయన్నారు. స్టెప్ సీఈవో ఎంవీఎస్ లోకేశ్వరరావు మాట్లాడుతూ యువజన సంక్షేమం కోసం అనేక అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నామన్నారు. భారతీయ సంప్రదాయ కళలైన జానపద నృత్యాలు, సంగీతం మొదలైన అంశాల్లో జిల్లాస్థాయిలో పోటీలు నిర్వహించి వాటిలో ప్రథమ స్థానంలో నిలిచిన వారిని రాష్ట్ర స్థాయి పోటీలకు పంపనున్నట్లు పేర్కొన్నారు. క్విస్ కాలేజీ ప్రిన్సిపాల్ వై.హనుమంతరావు మాట్లాడుతూ వివేకానందుని జీవితాన్ని ఆదర్శంగా తీసుకుని వారు చూపిన బాటలో నడుస్తూ మంచి ఫలితాలు సాధించి అభివృద్ధి పథంలో నడవాలని యువతకు సూచించారు. అనంతరం జానపద నృత్యాలు, జానపద గేయాలు, కథా రచన, పోస్టర్ మేకింగ్, ఫొటోగ్రఫీ విభాగాల్లో పోటీలు నిర్వహించారు. ఈ పోటీలకు కేంద్రియ విద్యాలయ అధ్యాపకులు, క్విస్ ఇంజినీరింగ్ కాలేజీ అధ్యాపకులు న్యాయ నిర్ణేతలుగా వ్యవహరించారు.

ఎగ్జిబిషన్‌తో మానసికోల్లాసం

- నగర మేయర్ గంగాడ సుజాత



ఎగ్జిబిషన్‌ను ప్రారంభిస్తున్న నగర మేయర్ గంగాడ సుజాత

ఒంగోలు టౌన్: నగర ప్రజలకు మానసికోల్లాసాన్ని కలిగించేందుకు ఎగ్జిబిషన్ ఉపకరిస్తుందని నగర మేయర్ గంగాడ సుజాత అన్నారు. శుక్రవారం నగరంలోని పాత కూరగాయల మార్కెట్ వద్ద ఏర్పాటు చేసిన అనిత ట్రేడ్ ఫెయిర్ వరల్డ్ సిటీ ఎగ్జిబిషన్‌ను ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ ఆధునిక పరికరాలతో ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్ నగర ప్రజలను అలరిస్తుందన్న నమ్మకాన్ని వ్యక్తం చేశారు. ఒత్తిడి నుంచి ఉపశమనానికి పిల్లాపాపలతో కలిసి సంతోషంగా గడపాలని ప్రజలను కోరారు. వినాయక చవితి, దసరా పండగలను పురస్కరించుకొని ఏర్పాటు చేసిన ఈ ఎగ్జిబిషన్‌లో ఉచిత పార్కింగ్ సౌకర్యంతో పాటు ఉచితంగా మినరల్ వాటర్ అందించనున్నట్లు నిర్వాహకులు వల్లంశెట్టి శ్రీనివాసరావు, నుసుం అంకిరెడ్డి తెలిపారు. మూడు సంవత్సరాల్లోపు పిల్లలకు ఉచితంగా ప్రవేశం కల్పించినట్లు చెప్పారు. అన్నీ వర్గాల ప్రజలకు అందుబాటులో ఉండేలా ప్రవేశ రుసుం కేవలం 30 రుపాయలుగా నిర్ణయించినట్లు తెలిపారు. రోజూ సాయంత్రం 4 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు ఎగ్జిబిషన్ ఉంటుందని, రెండు నెలలపాటు ప్రజలకు అందుబాటులో ఉంటుందన్నారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి చెందిన కార్పొరేటర్లు షేక్ ఇంతిజార్, యాదాల రాజశేఖర్ పాల్గొన్నారు.

నేడు గడప గడపకు మన ప్రభుత్వం

ఒంగోలు సబర్బన్: ఒంగోలు రూరల్ మండలం చింతాయగారిపాలెంలో శనివారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని కార్యాలయం విడుదల చేసిన ప్రకటనలో పేర్కొంది. ఈ మేరకు ఉదయం 7.30 గంటలకు చింతాయగారిపాలెం గ్రామ సచివాలయం పరిధిలో కార్యక్రమం ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. మాజీ మంత్రి, ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. అందుకుగాను కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ ఒంగోలు మండల నాయకులు, కార్యకర్తలు, మహిళా నాయకులు, సర్పంచులు, ఎంపీటీసీలు, జెడ్పీటీసీ, కన్వీనర్లు, వలంటీర్లు, గృహ సారథులు, సచివాలయ సిబ్బంది విధిగా హాజరు కావాలని కోరింది.

శ్రీవాణి హైస్కూల్లో కంటి వైద్య పరీక్షలు

కొత్తపట్నం: శ్రీవాణి హైస్కూల్లో మాడరన్ ఐ హాస్పిటల్, రీసెర్చ్ సెంటర్ ఆధ్వర్యంలో శుక్రవారం విద్యార్థులకు కంటి వైద్య పరీక్షలు నిర్వహించారు. కంటి లోపాలు ఉన్న విద్యార్థులను గుర్తించారు. ప్రిన్సిపాల్ చాపల కోటేశ్వరరావు మాట్లాడుతూ అన్ని పనులు చేయాలంటే కంటి చూపు ఉండాలని, అటువంటి చూపును అందరూ నిర్లక్ష్యం చేస్తున్నారని విచారం వ్యక్తం చేశారు. ప్రాథమిక దశలో కంటి చూపును గుర్తిస్తే వారికి కళ్ల జోళ్లు, తలనొప్పి వంటివి చిన్న వయసులోనే నయం అవుతాయన్నారు. ఇప్పుడు తినే ఆహారం కలుషితమై ఆహారం తీసుకుంటున్నామన్నారు. పౌష్టికాహారం తీసుకోకపోవడంతో చిన్న వయసులోనే దృష్టి కోల్పోతున్నారని వివరించారు. ఆకుకూరలు, కాయకూరలతో కూడిన పౌష్టికాహారం తీసుకోవాలని సూచించారు. పి.ప్రసాద్, ఏ.కిరణ్‌కుమార్, కె.సురేంద్ర పాల్గొన్నారు. విద్యార్థులకు డాక్టర్లు రమణా రెడ్డి, అర్పణ కలిసి 513 మందికి కంటి పరీక్షలు చేశారు.

చంద్రబాబును విమర్శించేందుకు అర్హతలు కావాలా?

ఒంగోలు: అవినీతి కేసులో అడ్డంగా దొరికిపోయి రాజమండ్రి సెంట్రల్‌జైలుకు వెళ్లిన చంద్రబాబును విమర్శించేందుకు మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్‌కు అర్హతలు కావాలా? అంటూ వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ జోనల్ ఇన్‌చార్జి మాకం జాన్‌పాల్ ప్రశ్నించారు. శుక్రవారం స్థానిక వైఎస్సార్ సీపీ జిల్లా కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి, మంత్రి ఆదిమూలపు సురేష్‌లపై వై.పాలెం టీడీపీ ఇన్‌చార్జిగా ఉన్న గూడూరి ఎరిక్షన్ బాబు చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. వై.పాలెం నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో తాగునీటి సమస్య తీర్చేందుకు సొంత డబ్బుతో బోర్లు వేయించిన ఘనత తమ నాయకునిదన్నారు. తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో చర్మకారులకు వెయ్యి రూపాయలు, డప్పు కళాకారులకు రూ.1500లు ఇస్తే తమ ప్రభుత్వం రూ.2 వేలు మొదలు రూ.2750 వరకు చర్మకారులకు, రూ.3 వేలు డప్పు కళాకారులకు అందిస్తోందని గుర్తు చేశారు. రాష్ట్రవ్యాప్తంగా 6600 మందికి మాత్రమే చర్మకారులకు పెన్షన్లు ఇస్తే తమ ప్రభుత్వం 31 వేల మందికి అందిస్తోందన్నారు. డప్పు కళాకారులు 6 వేల మందికి మాత్రమే టీడీపీ పెన్షన్ ఇచ్చిందని, నేడు 31,283 మందికి పెన్షన్ ఇస్తున్నట్లు చెప్పారు. తమ ప్రభుత్వంలో డప్పు కళాకారులకు ఏకంగా రూ.600 కోట్లు, చర్మకారులకు రూ.350 కోట్లు ఇప్పటి వరకు ఇచ్చామని, దమ్ముంటే మీ ప్రభుత్వంలో ఎంత ఇచ్చారో సమాధానం చెప్పాలన్నారు. అక్రమ అరెస్టులంటూ నిరసన ప్రదర్శనలు చేయడం మానుకుని చేతనైతే నిజాయితీ నిరూపించుకుని చంద్రబాబును బయటకు రమ్మని సవాల్ విసిరారు.

ప్రథమ చికిత్సపై అవగాహన పెంచుకోవాలి



మాట్లాడుతున్న ఒంగోలు రెడ్‌క్రాస్ చైర్మన్ ప్రకాష్‌బాబు

- ఒంగోలు రెడ్‌క్రాస్ చైర్మన్ ప్రకాష్‌బాబు

ఒంగోలు: ప్రథమ చికిత్సపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని, అనుకోని ఘటన జరిగినప్పుడు ప్రథమ చికిత్స అందించడం ద్వారా కాపాడవచ్చని ఒంగోలు రెడ్ క్రాస్ చైర్మన్ పి.ప్రకాష్‌బాబు అన్నారు. శుక్రవారం స్థానిక క్విస్ ఫార్మసీ కాలేజీలో ఎన్ఎస్ఎస్ యూనిట్, యూత్ రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో ప్రథమ చికిత్సపై జరిగిన అవగాహన సదస్సుకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రథమ చికిత్స అంటే ఏమిటి, ఎప్పుడు చేయాలి, ఎలా చేయాలి అనే దానిపై అవగాహన కల్పించారు. ప్రథమ చికిత్స ప్రాధాన్యతను విద్యార్థులకు అవగాహన కల్పించారు. ప్రస్తుతం ప్రతి ఇంట్లో ప్రథమ చికిత్స పెట్టే అందుబాటులో ఉంచుకోవడం అలవాటైందని, ప్రథమ చికిత్స ప్రాధాన్యతను ప్రజలు గుర్తించడంలో భాగమే అన్నారు. సాధారణంగా వంట గదిలో మహిళల చేతులకు కత్తిగాట్లు అవుతుంటాయని, ఆ సమయంలో ధారలా పడుతున్న కుళాయి నీటి కింద చేయిని ఉంచడం చేస్తుంటారని, కానీ అది సరికాదన్నారు. దానికన్నా గాయమైన చోట మరో వేలితో గట్టిగా కనీసం నాలుగు నిమిషాలు నొక్కి పట్టి ఉంచితే రక్తస్రావం ఆగుతుందన్నారు. అనంతరం దూది ఉంచి, ఆపై పట్టీ వేసుకోవచ్చన్నారు. కాలేజీ వ్యవస్థాపక చైర్మన్ డాక్టర్ సూర్యకళ్యాణ్ చక్రవర్తి, ఎగ్జిక్యూటివ్ వైస్ చైర్మన్ డాక్టర్ గాయత్రీదేవి, ఫార్మసీ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ డి.దక్షిణామూర్తి, రెడ్ క్రాస్ సొసైటీ రాష్ట్ర కోశాధికారి డాక్టర్ సి.వెంకటేశ్వరరెడ్డి, ఒంగోలు రెడ్‌క్రాస్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ జె.కృష్ణా, ఎన్ఎస్ఎస్ కో ఆర్డినేటర్ ధనామూర్తి పాల్గొన్నారు.

జగనన్న ఆరోగ్య సురక్ష పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి



ఇంటింటి సర్వేలో పాల్గొన్న నగర కమిషనర్ వెంకటేశ్వరరావు

ఒంగోలు సబర్బన్: రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా ప్రవేశ పెట్టనున్న జగనన్న ఆరోగ్య సురక్ష పథకానికి సంబంధించి ఒంగోలు నగరంలో శుక్రవారం ఇంటింటి సర్వే చేపట్టారు. ఈ మేరకు నగరంలోని బాలాజీ నగర్‌తో పాటు నగరంలో నిర్వహించిన సర్వేలో నగర కమిషనర్ ఎం.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కమిషనర్ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్ ఆదేశాల మేరకు ఈ నెల 15వ తేదీ నుంచి జగనన్న ఆరోగ్య సురక్ష పథకంలో భాగంగా ఇంటింటి సర్వే చేపట్టామన్నారు. 16వ డివిజన్ కార్పొరేటర్ శ్రీరాం నాగభూషణం, నగర పాలక సంస్థ ఎంహెచ్‌ఓ, డీఎంహెచ్‌ఓ వాణిశ్రీ, డీసీహెచ్ బాలాజీ నగర్ వైద్యులు సంతోష్ పాల్గొన్నారు.

మద్దిపాడు: ప్రతి ఒక్కరికీ ఆరోగ్యం అందించాలన్న తాపత్రయంతో 'జగనన్న ఆరోగ్య సురక్ష' కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారని ఎంపీపీ వాకా అరుణ కోటిరెడ్డి అన్నారు. మండల పరిషత్ ఆవరణలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆమె శుక్రవారం సాయంత్రం మాట్లాడారు. రాష్ట్రంలో ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా ఉండాలని ముఖ్యమంత్రి ఇటువంటి కార్యక్రమం ఏర్పాటు చేసినందుకు ఆమె కృతజ్ఞతలు తెలిపారు. ప్రజల గురించి ఇంతగా ఆలోచించే సీఎం ఈకాలంలో ఎవరున్నారంటూ ప్రశ్నించారు. మండలానికి రెండో పీహెచ్‌సీ ఇనమనమెళ్లూరు గ్రామానికి మంజూరైందని చెప్పారు. ఎంపీడీఓ శ్రీనివాసరావు, డాక్టర్ నీరజ, మండల పార్టీ కన్వీనర్ మండవ అప్పారావు, వాకా కోటిరెడ్డి, మోరబోయిన సంజీవరావు, గుడ్డపాతల రవి, జిల్లా సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు బెజవాడ రాము, కోఆప్షన్ మెంబర్ మోషే, సర్పంచ్‌లు వెంకటేశ్వర్లు, సుబ్బారెడ్డి, నాగమల్లేశ్వరి, బొమ్మల రామాంజనేయులు, డొక్కా మరియమ్మ, ఎంపీటీసీ పైనం ప్రభాకర్, నాయకులు విల్సన్, మజీద్ మాస్టర్ పాల్గొన్నారు.

అల్లూరు (కొత్తపట్నం): జబ్బులు ముందుగా తెలుసుకుని నయం చేసి ప్రాణాలు కాపాడటానికే జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిందని ఎంపీపీ లంకపోతు అంజిరెడ్డి అన్నారు. మండలంలోని అల్లూరు సచివాలయం-1లో శుక్రవారం ఆయన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ప్రారంభించారు. తొలుత మెడికల్ అధికారులు, వలంటీర్లు, సచివాలయ సిబ్బందితో జగనన్న ఆరోగ్య సురక్ష అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఎంపీడీవో పి.సుజాత మాట్లాడుతూ దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా మన రాష్ట్రంలో వైద్య రంగానికి పెద్దపీట వేశారని చెప్పారు. డాక్టర్ హేమంత్‌కుమార్ మాట్లాడుతూ జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో ఏడు రకాల వైద్య పరీక్షలు చేయనున్నట్లు పేర్కొన్నారు. ఎంపీటీసీ మిట్నసన శాంతారావు మాట్లాడుతూ జగనన్న ఆరోగ్య సురక్ష ప్రోగ్రాం పేద కుటుంబాలకు, బడుగు, బలహీన వర్గాలకు ఉపయోగపడుతుందన్నారు. మిట్నసల పూజిత గృహానికి వెళ్లి ఆరోగ్య పరిస్థితులను తెలుసుకుని యాప్‌లో అప్‌లోడ్ చేశారు. ఎంఈవో తులసీకుమారి, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ అరుణకుమారి, వీరేపల్లి రామచంద్రారెడ్డి పాల్గొన్నారు.